# వియోగం

* శ్రీమతి పి. యశో. సుదేష్ణ *

"......నా ఇంట్లో నీకు చోటు లేదు. నీ ప్రియుని దగ్గరికే వెళ్లు, పో—ఇంకెప్పుడయిన ఈ గడప తొక్కావంటే నీ ఒంట్లో ఊపిరుండదు జాగ్రత్త!"

కన్న తండ్రే ఈ మాటలన్నాడు. ఇంక ఆమేమి చేస్తుంది. తల్లికూడ నాన్నకు భయపడుతుంది. భర్త కర్కశ కఠోరమైన మాటల్తో కూతుర్ని తిట్టిపోస్తూంటే, పెదవి గదల్పక, కడుపు నుంచి పొంగివచ్చే దుఃఖాన్ని దిగ మ్రింగుతు, చూస్తూ వుంది.

"తండ్రితో పోట్లాడి ఇంటినుంచి వెళ్లితే లోకమేమను కొంటుంది! ఇంట్లో కూర్చుని ఎన్ని అకృత్యాలు చేసినా, పాడులోకము కన్నుమూసు కొంటుంది. బహిరంగంగా ఎంత నిష్కల్మష హృదయముతో ప్రవర్తించినా, లోకం ఆ యువతి శీలాన్ని అనుమానించి ఆమెను నడివీధి కీడుస్తుంది. ఇదేమి న్యాయం? నిజంగా దేవుడుంటే ఇన్ని అన్యాయాలు జరుగుతాయా? ప్రతి ప్రాణికీ జీవాధారం లభించి, ఈ జానెడు పొట్టకే కూడు లేకపోతుందా?...... ఆత్మ హత్య!!!!......కూడదు—చచ్చి సాధించ గలిగే దేమీ లేదు. నాకీ జీవితంలో విరక్తి గలుగ లేదు. కలగడానికి అవకాశం ఏది? నా చదువు నిష్ప్రయోజనము. కాలేజీ, ఇల్లు తప్ప ఇంకే చోటికైనా పోనిచ్చారా నాన్న? నేను "ఆగాఖాన్ పాలెస్"నందుండిన మహాత్మా గాంధీజీవంటి డిటిన్యూ. ఇక మీదనైన స్వేచ్ఛగ ప్రవర్తించడానికి వీలుంటుంది. నేను ఎవరిని లక్ష్యపెట్టను. నా మనస్సునే అనుగమిస్తాను..."అనుకొంటూ, మనస్సు పరిపరి విధాల లాగుతుంటే, ఏకధారగా కార్తున్న కన్నీటిని తుడుచు కొంటూ, తండ్రికి జవాబైన చెప్పక, దీనంగా తనవైపు చూస్తున్న తల్లికి కళ్ళనుంచి హృదయ పూర్వక నమస్కారము చేసి, వీధి గుమ్మం దాటింది.

ఆమె లలిత. బందరు నివాసియగు అడ్వొకేటు రామరావుగారి కుమార్తె. రామరావు ఇంటపులి, బయట పిల్లి. లలితంటే అసహ్యం. అందుచేత యుక్త వయస్సు వచ్చినా వివాహంకాలేదు. కాని అతడు ఒక పుణ్యం మాత్రం గట్టుకొన్నాడు. లలితను ఆ వూరి హిందూకాలేజియందే బి. ఏ. దాక చదివించాడు. లలితలో అందచందాలు ఉట్టి పడుతున్నాయి. నవ్వులొలుకుచు నక్షత్రాల్లాగ మెరుస్తూన్న కండ్లు, చిన్ని నోట్లోనుంచి తొంగి చూచే పలువరుస;— ఇంతకు లలిత నగ్నశోభ (పౌడరు, లిప్‌స్టిక్ నుంచి రాని అందం)- ఏ కాలేజి విద్యార్థిని ఆకర్షింపకుండును!

ఇట్లు ఆకర్షింపబడిన వారిలో రాజశేఖర్ ముఖ్యుడు. అతడే లలిత హృదయాన్ని, అయస్కాంతములాగ ఆకర్షింప గలిగాడు. శేఖర్ రెడ్డికులజుడు. ఉత్తముడనదగిన వాడు. లలితా శేఖరులు బి. ఏ. వరకు క్లాస్‌మేట్స్. వారి స్నేహం ప్రణయంగా పరిణమించిది.

విశ్వవిద్యాలయ పరీక్షలు ముగిసినాయి. లలిత-శేఖరు, లిద్దరు బాగా వ్రాశారు కాబట్టి పాస్ అవుతా మనుకొన్నారు. అతడింక స్వగ్రామానికెళ్లాలి. లలిత సెలవు పొందడానికి ఆమె ఇంటికి వచ్చాడు.

సూర్యుడు వీరి ఎడబాటును చూడలేక తలవంచుకొనుచున్నాడా అన్నట్లు కొండమాటుల్లోంచి పడమట సముద్రంలోనికి జారుచున్నాడు. గది కిటికీలోనుంచి లలితా-శేఖరులు ఆ దృశ్యాన్ని పరికిస్తూ, సూర్యునే సాక్షిగా నిడికొని, ఎన్ని కష్టాలు గలిగిన వివాహము చేసుకొంటామని తీర్మానించుకొన్నారు.

ఇంతలో రామరావు కోర్టునుంచి ఇంటికొస్తూ, ఎవరిదో మగగొంతు వినబడితే అనుమానించి, తెరచివున్న లలిత గది లోకి తొంగిచూచి నిర్ఘాంతపోయాడు. మానవ ప్రతిబంధకములు ప్రేమోత్పత్తికి అడ్డంకులు కావని అతడు తెలిసికొలేక పోయాడు. మనిషిని బంధించినా మనస్సును బంధింపలేరని అతడెరుగడు. కళ్ళల్లో నిప్పులు గ్రక్కుచు, లలితను ఇంట్లోకి లాక్కెళ్లాడు. రాజశేఖర్ నాటి సంఘటనను గురించి విచారిస్తూ, తన గ్రామం వెళ్లిపోయాడు.

రాత్రి అయింది. ఆ వూర్లో లలితకు బంధువులు, స్నేహితులు బోలెడు మందున్నారు. వాళ్లెవరి దగ్గరకు వెళ్ళ కూడదను కొన్నది లలిత. వీధిలో పోతూ, పోతూ, చేతిలో వున్న గాజొకటి అమ్మేసి డబ్బుతీసికొని స్టేషనుకు వెళ్ళింది. తానేం చేస్తున్నది తనకే తెలియడంలేదు. కలకత్తా టికెట్ కొనడము, రైలెక్కి ఎవరులేని స్త్రీల కంపార్టుమెంటులో కూర్చోడం, రైలు స్టేషను వదలడము—నిమిషాల మీద జరిగి పోయాయి.

ఎన్ని స్టేషనులు దాటిందో, ఎన్నిచోట్ల రైలాగిందో ఆమె గమనించలేదు. తనకుగలిగిన అవస్థను తలంచుకొంటూ, బయట చీకటినిచూస్తూ, కళ్ళవెంబడి వేడినీళ్ళను కార్చుతు కూర్చుంది. చల్లటి హస్త స్పర్శ—లలిత అదరి పడింది. "సోదరీ" అన్న మాటలను విన్నది. కండ్లు తుడుచుకొని చూచేసరికి, ఎదుట ఒక స్త్రీ నిలిచి వున్నది. ఆమెకు దాదాపు నలభై ఏళ్ళుండొచ్చు. చూడ్డానికి గొప్ప యింటి స్త్రీలాగ కనబడింది. లలిత వైపు చాలా జాలి కలిగిందావిడకు. క్రమంగా లలిత చరిత్ర తెలిసి కొన్నది. తన పేరు రమణియని, కలకత్తాలో వున్నానని చెప్పింది.

కలకత్తా! కూలీ! కూలీ!! కలకత్తా స్టేషన్!! వచ్చేసింది కలకత్తా. లలితను తన ఇంటి కాహ్వానించింది రమణి. "నా" అనే వారులేని ఆ మహాపట్టణములో, మాతృ వాత్సల్యముతో రమ్మని పిలుస్తుంటే పోక పోవడమా? టాక్సీ చౌరంఘీ వీధిలో గొప్ప భవనము ముందాగింది. లలితకెందుకో ఆ ఇంటి వైఖరి చూచేటప్పటికి తీరని అనుమానం కలిగింది. వ్యభిచార గృహమని పోల్చుకొంది.

తానెందుకా వూరికి వచ్చిందో, ఏం చేస్తుందో కూడా తెలియని స్థితిలో కలవరపడ సాగిందామె. రమణి ఎన్ని విధాల బతిమాలినా గదినుంచి కదలలేదు. రాత్రి అన్నం తినలేదు. నిద్ర శాంతిని చేకూర్చగలదని, పరుండినది. నిద్రాదేవత ఆమెను ఆవేశించింది. క్రింద గదుల్లోమాత్రము గందరగోళంగావుంది. వింత వింత రంగుల ఎలెక్ట్రిక్ దీపాలు రంగురంగు కాంతుల ప్రసరించుచుండెను.

లలిత తలుపు గొళ్ళెంపెట్టడం మరచిపోయింది. సుమారు 11 గంటలై యుండొచ్చు. ఎవరో వాకిలి తెరచినట్లు కిర్రుమన్న శబ్దమయినది. ఆమెకు మెలుకువైంది. కళ్ళు నులుముకుంటు లేచి చూస్తే, ఎదుట పాతికేళ్ళ యువకుడు తన వయిపు వికటాట్టహాసముతో చూస్తూ తూలుతుండెను. నోరు బ్రాందీకంపు. లలితకతన్నిచూస్తే సంకోచము, జాలి, భయము, అసహ్యము గలిగినవి.

"ఇదిగో! చూడు! నిన్నే-నే నెవరో తెలుసునా? నా పేరు రామచంద్ర. నా కంటె ధనికులీపట్టణములో లేరు నీవెవరైతే నాకేం! నీవు అందకత్తెవని, గాయకురాలవని, విద్యావతివని, ఒక రాత్రికే నా వద్ద నూరు రూపాయలు పుచ్చుకొని, నిన్ను నావశం చేసింది రమణి. ఇంకా ఏమేమో వాగుతున్నాడు.

గుండెల్లో దడ పుడుతున్నా, లేని ధైర్యం తెచ్చుకొని తన వృత్తాంతాన్ని గద్గదస్వరంతో తడబడ్తు చెప్పతుంటే- రామచంద్ర రెప్పవాల్చక ఆమె నోటివైపే చూస్తూ, వంగి ఆమె మంచంమీద ఒకకాలుంచి వింటుండెను. బ్రాందీ కయిపు తగ్గింది. విద్యావంతులకు కూడ ఇటువంటి అవస్థలు గలుగుతాయంటే, నిరక్షరకుక్షియగు రామచంద్ర కాశ్చర్యమేసింది. అతని ఎఱుకలేకుండనే మార్పొకటి అతనిలో గలిగింది. వెంటనే లలితతో ఇట్లు చెప్పాడు: "సోదరీ! నేను మునుపటి వాడినికాను. నీ గాథ నాలో పరిణామాన్ని గలిగించింది. రమణిచే మోసగింపబడినావు. అది వారకాంత నీకు ఇక్కణ్నుంచి తప్పించుకోవాలనియుంటే తక్షణం వెళ్లు."

అతనికి తన కృతజ్ఞతను ఆనందాన్ని చూపిస్తు ఒక చిరునవ్వు విసరి, సెలవు పుచ్చుకొన్నది.

భయంలేకుండా కారు చీకట్లో చరచర నడచి సముద్ర తీరము వైపు పోతున్నది—లలిత. టంగ్! టంగ్!! టంగ్!!! మని మూడు గంటలు మ్రోగినది. ఎక్కడికి పోయిన విధి తనకు ప్రతికూలుడుగానే వుంటాడని, మరణమే శాశ్వతానందాన్ని చేకూర్చ గలదని ఆమె తలచింది. సముద్రతీరంలో నిలుచున్నది. ఆలస్యమయితే, రమణివంటి వ్యక్తుల కళ్ళలో పడాల్సివస్తుందేమో అని జడిసింది. ఒక నిమిషం ఆమె ఆత్మమరల ప్రపంచంలో జీవించ

మని బోధించింది. సముద్రుడు కాల రూపముతో గర్జిస్తు ఆమెను తన లోకాని కాహ్వానించాడు.

దూరాన్ని ఏదో నీడ తన దిక్కుగా వస్తున్నట్టు లలిత గ్రహించి, తాను ఆ వైపే నడక సాగించింది. రెండునీడలు ఆ చీకట్లో మిళితమై పోయాయి—"లలితా"!—"శేఖర్"!

ఇరువురు ప్రపంచాన్నే మరచిపోయారు. అసంభవమను కొన్నది సంభవించింది. "శేఖర్" ఇక్కడి కెట్లొచ్చావ్! అని అడిగితే శేఖర్ లలితతో ఈ విధంగా చెప్పాడు. "లలితా! నేను వూరికి పోతుంటే రైల్లో ఇంపీరియల్ బ్యాంకు మానేజరుతో మాట్లాడటం తటస్థించిది. అతడు, కలకత్తా బ్రాంచిలో ఆడిటర్ పని ఖాలిగావుందని, నన్ను ఆ పనికి అంగీకరించమన్నాడు. సరే నన్నాను. తీరా ఇంటి కెళ్ళే సరికి మా నాన్నకు మన ప్రేమవృత్తాంత మెట్లా తెలిసిందో కాని, నేను గుమ్మం తొక్కకముందే, బయటికి గెంటి, తన ఇంట్లో వుండవీల్లేదన్నాడు. ఇక్కడి కొచ్చేశా. రెండువందల జీతంపైన ఉద్యోగాన్ని అంగీకరించా. కానీ, లలితలేని ప్రపంచం శూన్యమనిపించింది. డబ్బు సంతోషాన్ని చేకూర్చజాలదనియు, ప్రేమలేని మానవుని జీవితము ఎండిన చెరువుతో సమానమనియు, గ్రహించాను. నిన్ను చూచే భాగ్యం కలుగుతుందనే ఆశ నశించింది. మరోలోకంలోనైనా నిన్ను కలిసి కొందామని, ఆత్మహత్యకు సిద్ధపడి ఇక్కడి కొస్తే దూరాన్ని నీడ అగుపించింది. ఎవరై యుంటారా! అని సమీపిస్తే—నా లలిత—మనం చావాలని దేవుని ఉద్దేశము కాదు, లలితా! రా మన యింటికిపోదాం"

మందమారుత మొకటి లలితా—శేఖరుల నాశీర్వదిస్తు, సముద్రపునీటి తుంపురులు, వారి మీద రాల్చింది. పక్షులు ఒకటొకటే మేతకొరకు బయలుదేరుతున్నాయి. సూర్యునికి మెలుకువైంది. లలితా—శేఖరులను భార్యా భర్తలుగా చేశాడు, ఆపద్బాంధవుడు......దినకరుడు......

★

# యోగ్యత!

శ్రీమతి వి. యస్. ఆర్. నాయికమ్మగారు

ఫలము నాశించి సాఫల్య పదము లెపుడు
మూలగూర్చని పాడిన - ముదమొసంగు
ఫలిత మదిమాత్ర మెన్నడు పొందలేరు,
యోగ్యతను ఫలమునుబొంది యోగ్యులగుదు!

*    *    *

పెద్దవారల చేయూత పేరుకేని
మది దలంచక ముదమున మందగతిని
పడుచు లేచుచు పయనించు బాలపాప
లందు యోగ్యత గాంచుడు లక్షణముగ!

*    *    *

పరుల సహకార మాశించు ప్రజలకెపుడు
క్షణిక సుఖానందంబను కాంక్ష ప్రబలి
బద్ధకంబను రుగ్మత పట్టుగాని
యోగ్యతను దానికి వార యోగ్యులగును!

*    *    *

ఘోరయాపద లన్నింటి గోటమీటి
వచ్చి పైబడు కష్టాల, వమ్మొనర్చి
ప్రగతి పథమున బెదరక పయనమగుడె
నవయుగ ప్రవక్త బాపూజి నమ్మినట్లు!

*    *    *

పరుల సహకారమీడిన బలముకలుగు
ఆత్మవిశ్వాస మద్దాని యండనుండు
మదిని పీడించు భూతాలు మాయమగును
యోగ్యతకు సాటి ధరణిలో యేదిగలదు?

★